

● సిమెంటు రాళ్లతో నిర్మించిన ఇళ్ల గోడలు



తెనాలిలో అడుగు లోతులోని పిల్లర్లపై లబ్ధిదారుల ఫిర్యాదుతో పీకేసిన అధికారులు

కూలుతున్నా.. కట్టాలంట

- జగనన్న కాలనీ ఇళ్లలో అక్రమాలు
- పిచ్చుక గూళ్లలా కట్టినోళ్లకే మళ్లీ కాంట్రాక్టు
- ప్రభుత్వం మారినా వైసీపీ వారే నిర్మాణదారులు
- వంద రోజుల ప్రణాళిక అని అధికారుల హడావుడి
- గృహ నిర్మాణ శాఖకు బకాయిలున్నా వారికే పనులు
- రికవరీకి జప్తు నోటీసు లిచ్చి.. మళ్లీ పనులు అప్పగించిన వైనం

తెనాలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పది కాలాలు ఉండాల్సిన ఇళ్లు నిర్మాణదాశలోనే కూలుతున్నాయి. గోడలు ఒరిగిపోతు న్నాయి. అయినా ఇంకెవరూ జగనన్న ఇళ్లు కట్ట లేరన్నట్లుగా.. తిరిగి వారికే కూటమి ప్రభుత్వంలోనూ అధికారులు పనులు అప్పగిస్తున్నారు. ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్ ముసుగులో వైసీపీ నేతలు కట్టిన పేదల ఇళ్లలో నాణ్యతా లోపాలు కంటికి కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ కాంట్రాక్టర్ ముసుగు వేసుకున్న వారు మాత్రం మారలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ నేతలకే ఇళ్ల నిర్మాణ పనులు అప్పగిస్తున్నారు. 100 రోజుల ప్రణాళిక అనిచెప్పి అధికారులు హడావుడి చేసేస్తూ వారినే ఇళ్లు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిం చాయని నాడు గగ్గోలు పెట్టిన కూటమి నేతలు కూడా ఇపు డు పెదవి మెద పడంలేదు. అనుభవం లేకున్నా.. అధికారులు వైసీపీ కాంట్రాక్టర్లకే ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్డు కాంట్రాక్టర్లా అంటే అదీ కాదు.. అయినా ఇంకెవరూ లేరన్నట్లుగా వైసీపీ వారే దిక్కనట్లుగా ఇళ్ల పనులు ఇచ్చారు. జగనన్న కాలనీల్లో గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొదటి విడతలోనే భారీ అక్రమాలు జరిగాయని లబ్ధిదారుల నుంచి నాటి కూటమి నేతల వరకు ఆరోపణ. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు న్నాయని, నిర్మాణం కోసం ఇచ్చిన ఇనుము, సిమెంట్‌లను కొందరు కాంట్రాక్టర్లు అమ్మేసుకున్నారనే విషయాలపై గతంలోనే ఆధారాలతో నేతలే బయటపెట్టారు.

అప్పనంగా అప్పగించేశారు..

జగనన్న కాలనీల స్థలాలు కొనే విషయంలో ఎమ్మెల్యే స్థాయి వారికి భారీ లబ్ధి చేకూర్చిన అప్పటి వైసీపీ సర్కారు, ఇళ్ల నిర్మాణంలోనూ కిందిస్థాయి నాయకులకు లబ్ధి కలిగేలా అర్హతా లేని వారికి పనులు అప్పగించారు. అడ్వాన్స్‌ల రూపంలో తొలి దోపిడీకి తెరతీస్తే, తర్వాత ఇంటి నిర్మాణానికి ఇచ్చిన ఇనుము, సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించి కొందరు అమ్మేసుకున్నారు. 12 అడుగుల లోతులో పిల్లర్లు నిర్మించాని గృహనిర్మాణ శాఖ సూచిస్తే, చాలాచోట్ల 3 నుంచి 6 అడుగుల లోతులో గోతులు మాత్రమే తీసి పిల్లర్లు వేశారు. కొన్నిచోట్లయితే కేవలం అడుగు లోతులోనే పిల్లర్లు వేశారు. ఇటువంటి వాటిని తెనాలి, గుంటూరు, పొన్నూరు, బాపట్లలో కొందరు సి బ్బంది గుర్తించి వాటిని తిరిగి నిబంధనల ప్రకారం నిర్మించాలని కోరితే వైసీపీ కాంట్రాక్టర్లు వారి మాటలు పట్టించు కోలేదు. ఎవరైనా గట్టిగా అడిగితే వారిపై దౌర్జన్యం చేసిన సందర్భాలున్నాయి. తెనాలి వంటిచోట్లయితే కొందరు అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోపిడీకి దారులు చూపించారు. మరికొందరు వారి బంధువులనే కాంట్రాక్టర్లుగా రంగంలోకి దించి నిధులు దోచేశారు. పేరేచర్ల, బాపట్ల, మరికొన్ని చోట్లయితే నిర్మాణం పూర్తయిన ఇళ్లు కూలిపోవడం, గోడలు పడిపోవటం వంటివి అప్పుడే బయటపడ్డాయి. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, మంగళగిరి నియోజకవర్గాల పరిధిలో చాలా లేఅవుట్లలోగోడలకు పగుళ్లిచ్చాయి. దారుణంగా ఇళ్ల నిర్మాణాలు చేసినా, రూ.కోట్లలో నిధులు దోచేసినా వారికే మళ్లీ పనులు అప్పగించడం చూస్తే దొంగ చేతికే తాళాలు ఇచ్చిన చందంగా అధికారుల తీరు ఉందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నాసిరకం పనులపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసిన కాంట్రాక్టర్లకే కూటమి ప్రభుత్వంలోనూ పనులు ఇస్తున్నారంటూ వాపోతున్నారు. ఇటీవల తెనాలిలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి, వాటి పురోగతిని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా పాలనాధికారే పనులను పాత కాంట్రాక్టర్లతో చేయించాలని ఆదేశాలివ్వడం విమర్శలకు తావిస్తోంది. ఓపక్క రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి లేఔట్‌లలో ఇళ్లను పరిశీలించి ఐదుగురు కాంట్రాక్టర్‌ల నుంచి వెంటనే డబ్బు రికవరీ చేయాలని, ఒక కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే 100 రోజుల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యం పెట్టుకోవటం వల్లే వారికి పనులు అప్పగిస్తు న్నామని కొందరు అధికారులు చెబుతున్నారు.

ఇల్లు.. పేదల నుంచి ధనవంతుల వరకు కల. ఎవరి స్థాయిలో వారు పది కాలాలు ఉండేలా నిర్మించుకుంటారు. అలాంటి ఇళ్ల నిర్మాణాలను గత ప్రభు త్వం అపహాస్యం చేసింది. రూ.కోట్లు దోచుకునేందుకన్నట్లుగా నిర్మాణాలు చేపట్టారు. జగనన్న కాలనీల పేరుతో పేదల సొంతింటి కల నెర వేరుస్తున్నామంటూ దోపిడీకి వైసీపీ నాయకులు తెర లేపగా వారికి కొందరు అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. జగనన్న కాలనీల్లో పేదల కోసం ఆప్షన్ -3లో నిర్మిస్తున్న ఇళ్లు పిచుక గూళ్లుగా ఉన్నాయి. మూడడుగుల లోతులో వేసిన పిల్లర్లు.. నేలపైనే పునాదులు.. నిర్మాణం జరుగుతుండగానే పగుళ్లిస్తూ ఒరిగిపోతున్న గోడలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల పరిస్థితి. అయితే ప్రభుత్వం మారింది ఇలాంటి అక్రమాలు ఇక ఆగిపోతాయని లబ్ధిదారులు భావించగా అధికారుల తీరు వారిని నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నాటి వైసీపీ కాంట్రాక్టర్లకే మళ్లీ పనులు అప్పగిస్తూ నిర్మాణాలపై అధికారులు హడావుడి చేస్తున్నారు. వైసీపీ హయాంలో జగనన్న ఇళ్లలో జరుగుతున్న అక్రమాలపై ఆందోళన చేసిన టీడీపీ నేతలు ప్రస్తుతం మౌనం దాల్చడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



పనుల కంటే అడ్వాన్సులే అధికం..

ప్రభుత్వం వారిది.. కాంట్రాక్టర్లు వారే కావడంతో వారు ఏదడిగితే అదిచ్చేయటం, వారు ఎలా నిర్మించినా బిల్లులపై సంతకాలు చేయమంటే చేసేయడం గృహనిర్మాణ, మెప్మా అధికారుల వంతైంది. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరయితే, వీటిలో కేంద్రం రూ.1.5 లక్షలు విడుదల చేస్తే, మిగిలిన రూ.30 వేలు రాష్ట్ర ప్రభుత్వం వాటాకింద ఇవ్వాలి. కానీ ప్రభుత్వం దిగిపోయే వరకు ఆ వాటా మొత్తాన్ని విడుదల చేసే విషయాన్ని విదిలింపులతోనే సరిపెట్టారు. పైగా మెప్మా ద్వారా ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణం ఇప్పించి వారితో కట్టించారు. కనీసం లబ్ధిదారులు భరిస్తున్న మొత్తాలు కూడా ఇవ్వలేదు. పునాదులు వేస్తే ఇంటికి రూ.70 వేల చొప్పున అప్పనంగా వారి చేతిలో పెట్టేశారు. ఇవికాక మెప్మా రుణం మొత్తాన్ని లబ్ధిదారుల అంగీకారంతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల ఖాతాలకు మళ్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా ఏ అధికారీ అడ్డుకోలేదు. దీంతో ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల నుంచి 10 కోట్ల వరకు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేశారు. ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే కేవలం ఐదుగురు కాంట్రాక్టర్లకు రూ.9 కోట్ల వరకు ఇచ్చేశారు. అయితే వీరికి ఇవ్వాల్సిన బిల్లులు తీసేస్తే ఇంకా నేటికీ కాంట్రాక్టర్లే ప్రభుత్వానికి రూ.6.21 కోట్లు చెల్లించాలి. ఇదే తరహాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ వైసీపీ ఎమ్మెల్యేకి సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థ రూ.70 కోట్లపైన తిరిగి చెల్లించాలి. ఈ మూడు జిల్లాల్లోనే రూ.89 కోట్లకు పైనే కాంట్రాక్టర్ల నుంచి బకాయిలు రావాల్సి ఉందనేది ప్రాథమిక అంచనా. అయితే వీరందరికీ జూలై మొదటి వారంలోనే గృహనిర్మాణ శాఖ నోటీసులు జారీ చేసింది. ఎన్ని ఇళ్లు నిర్మాణానికి తీసుకున్నారో! వాటిలో ఎన్ని నిర్మించారో, వాటికోసం ఎంత డబ్బు అడ్వాన్స్ కింద తీసుకున్నారో వివరాలు తెలియచేస్తూ కాంట్రాక్టర్‌లకు నోటీసులిచ్చారు. నోటీసు అందుకున్న 15 రోజుల్లోగా మెప్మాకు, గృహ నిర్మాణ సంస్థకు బాకీ ఉన్న మొత్తాలను ఆయా ప్రభుత్వ ఖాతాలకు జమ చేయాలని నోటీసుల సారాంశం. అయితే వీటికి ఎవరూ స్పందించకపోవడంతో తాజాగా ఆస్తుల జప్తు చేస్తుమంటూ మరో నోటీసుకూడా కొన్నిచోట్ల అందించారు. కొందరు భయపడి చెల్లించడానికి ముందుకు వస్తే, చాలామంది ఏ సమాధానం లేకుండా ఉండిపోయారు. వీరిలో కొందరు మాత్రం తమకే ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉందని, వాటి విషయం తేల్చకుండా డబ్బు చెల్లించమంటే ఎలాగంటూ ఎదురుతిరిగారు.



తక్కువ ఎత్తులో పిల్లర్లతో పునాదులకే పరిమితమైన ఇళ్లు



సీఆర్‌డీఏ సమర్ధంగా

- విభాగాల వారీగా బలోపేతానికి అడుగులు
- అమరావతి పనులు ముమ్మరం చేసేలా పోస్టింగ్‌లు
- రెవెన్యూ విభాగానికి 23 మంది తహసీల్దార్ల డిప్యూటేషన్
- ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర విభాగాల పటిష్టతకు చర్యలు
- ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఎంబీఏ రంగాల వారికీ అవకాశం

విజయవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అమరావతిలో పనులు ముమ్మరం చేసేలా సీఆర్‌డీఏ శరవేగంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలకు.. ఆలోచనలకు అనుగుణంగా అమరావతిలో వివిధ ప్రాజెక్టులపై రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) దృష్టి సారించింది. ఈ క్రమంలో సమర్థంగా పని చేసేందుకు సీఆర్‌డీఏ తొలుత పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని పనులను ముమ్మరం చేసేందుకు సిద్ధమౌతున్న సీఆర్‌డీఏకు తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో భూ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించడం కష్టమైపోతోంది. ఒక్క రెవెన్యూ విభాగమే కాకుండా ఇంజనీరింగ్, ప్లానింగ్ తదితర ఇతర విభాగాలలో కూడా సీఆర్‌డీఏలో తగినంతమంది సిబ్బంది లేరు. ఈ పరిస్థితుల్లో సీఆర్‌డీఏలో వివిధ విభాగాలతో పాటు రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లను డిప్యూటేషన్ పద్ధతిలో పోస్టింగ్‌లు కల్పించింది. రాజధాని పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాకు చెందిన మొత్తం 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ కల్పించింది. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న 188 మందిని డిప్యూటేషన్‌పై తీసుకుంటామని జూలైలో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు రావడానికి ఏ శాఖ నుంచి కూడా ఇష్టపడలేదు. ఈ విషయాన్ని సీఆర్‌డీఏ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులే నేరుగా రంగంలోకి దిగి తమ పరిధిలో ఉన్న అధికారులను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ విధానంలో పంపిస్తున్నారు. మొదటిగా సీసీఎల్ఏ దీనికి పూనుకుంది. సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మి 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 23 మంది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సీఆర్‌డీఏకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. వీరే కాకుండా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలోనే 20 మంది అవసరం ఉంది. సీఆర్‌డీఏకు డిప్యూటేషన్ మీద వస్తున్న తహసీల్దార్లు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ల్యాండ్ యూజ్ మేనేజర్లు, ఎస్టేటు మేనేజ్‌మెంట్, ఎస్టేటు ల్యాండ్ ఎక్విజిషన్, ల్యాండ్ ప్రొటెక్షన్, రెవెన్యూ ఆఫీసర్స్ వంటి స్థానాల్లో పనిచేస్తారు. వీరికింద పనిచేసేలా డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇస్తారు. ల్యాండ్స్ డైరెక్టర్లుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలో తీసుకుంటారు. వీరికి సంబంధించి ఇంకా ఆదేశాలు రాలేదు. ఆర్డీవో, డీఆర్వోల స్థాయిలో ఉన్నవారిని తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలను కూడా సిబ్బందితో భర్తీ చేయాల్సి ఉన్నందున ఆయా శాఖలకు సంబంధించి ఇంకా డిప్యూటేషన్ ఖరారు కాలేదు.

పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ..

సీఆర్‌డీఏలో కాంట్రాక్టు విధానంలో పలు పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేశారు. డైరెక్టర్ (ప్లానింగ్), చీఫ్ ఇంజనీర్(ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్), గ్రూప్ డైరెక్టర్(సోషల్ డెవలప్‌మెం ట్), మేనేజర్(మీడియా),జాయింట్ డైరెక్టర్ (స్ట్రాటజీ), డిప్యూటీ డైరెక్టర్(ఫైనాన్షియల్ ప్లా నింగ్ స్ట్రాటజీ డివిజన్) పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామని చెబుతున్న టీడీపీ ప్రభుత్వం ఈ దిశగా ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడుతోంది. సీఆర్‌డీలో వర్థమాన పట్టభద్రులను దృష్టిలో ఉంచుకుని 9 ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. అడిషనల్ డైరెక్టర్ - ప్రొక్యూర్‌మెంట్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ మేనేజర్ - ప్రొక్యూర్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), జాయింట్ డెరెక్టర్ - ఎకనామిక్(ఎంబీఏ), ఎన్విరాన్‌మెంటలిస్ట్(ఎమ్మెస్సీ), సీనియర్ కన్సల్‌టెంట్ - క్వాలిటీ కంట్రోల్(సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ కన్సల్‌టెంట్ - ఇన్ఫ్రా మేనేజ్‌మెంట్ (సివిల్ ఇంజనీరింగ్), సీనియర్ అర్బన్ ప్లానర్ - ఆర్కిటెక్ట్(ఆర్కిటెక్చర్), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్ ఇంజనీరింగ్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు సీఆర్‌డీఏ వెబ్‌పోర్టల్‌లో కెరీర్స్‌లోకి వెళ్లి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే అందులోనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలి

విద్యుత్ చార్జీ పెంపుతో స్పిన్నింగ్ మిల్లుల మూత ● వస్త్ర పరిశ్రమలకు రూ.1400 కోట్లు విడుదల చేయాలి ● పారిశ్రామిక పాలసీ సమావేశంలో స్పిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు

నరసరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్పిన్నింగ్ మిల్లులకు అందించే ప్రోత్సాహకాలపై స్పిన్నింగ్ మిల్స్, వస్త్ర పరిశ్రమల అసోసియేషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో చాలావరకు స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో ఉత్పత్తి వ్యయం 35 శాతం పెరిగిందని, దీంతో 30 శాతం వస్త్ర పరిశ్రమలు మూతపడ్డాయని అసోసియేషన్ నేతలు తెలిపారు. వస్త్ర పరిశ్రమలకు దాదాపు రూ.1400 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల చేయాలన్నారు. నూతన పారిశ్రామిక పాలసీ రూపకల్పనపై కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన కలెక్టరేట్‌లో ఆయా అసోసియేషన్ నేతలతో మంగళవారం సమావేశం జరిగింది. వస్త్రపరిశ్రమలకు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయాలని, అధునాతన యంత్రాల ఏర్పాటుకు రాయితీలు అందించాలని, 10 శాతం మూలధన రాయితీ ఇవ్వాలని వారు కోరారు. మధ్యప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాల్లో పారిశ్రామిక విధానాలు చాలా బాగున్నాయన్నారు. మన రాష్ట్రంలో 2018-23 ముసాయిదా విధానం రూపొందించి అమలు చేయలేదన్నారు. 2018-23 టెక్స్‌టైల్ పాలసీలోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. రూ.2 విద్యుత్ టారిఫ్ అందించాలని, పరిశ్రమల ఆధునికీకరణకు ఇప్పటికే ఉన్న యూనిట్లకు మూలధన రుణంపై 8 శాతం వడ్డీ రాయితీ, పదేళ్ల గ్రీన్‌ఎనర్జీ పాలసీ బ్యాంకింగ్ సౌకర్యం కోసం అభ్యర్థించారు. లాజిస్టిక్స్ ప్రోత్సాహకాలు అందించడంతో పాటు హైస్పీడ్ వీవింగ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలన్నారు. పీపీపీ మోడల్లో వస్త్రాలను నేయడానికి, ప్రాసెసింగ్ చేయడానికి ప్రాసెసింగ్ హౌస్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

గ్రానైట్‌కు పోత్సాహకాలు ఇవ్వలేదు

జిల్లాలో 150 వరకు గ్రానైట్ యూనిట్లు ఉన్నాయని మూడేళ్లుగా ప్రోత్సాహకాలు విడుదల చేయలేదని గ్రానైట్ అసోసియేషన్ నేతలు తెలిపారు. పరిశ్రమ ప్రాజెక్ట్ వ్యయం పెరిగిందని, కానీ ప్రోత్సాహకాలను తగ్గించారన్నారు. పెట్టుబడి రాయితీని రూ.40 లక్షలకు పరిమితం చేయాలన్నారు. విద్యుత్ టారిఫ్ రూ.2 అందించాలన్నారు. పరిశ్రమలకు సోలార్ పవర్‌కు పోత్సాహకాలు అందించాలని కోరారు. విద్యుత్ చార్జీల్లో తెలంగాణ, ఏపీ మధ్య 30% ఉత్పత్తి వ్యయ వ్యత్యాసం ఏర్పడుతోందని ప్లాస్టిక్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఏపీఐఐసీ భూముల్లో, భూమి కొనుగోలు చేసి పరి శ్రమ స్థాపించే అవకాశం లేని పరిస్థితి నెలకొంద న్నారు. ఇండస్ట్రియల్ పార్కులు నెలకొల్పాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ శిక్షణా సౌక ర్యాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఎల్‌టీ కేటగిరికి విద్యుత్ వినియోగ చార్జీలు తగ్గించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.సుధాకర్, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి, ఎల్డీఎం రాంప్రసాద్, డీఆర్డీఏ పీడీ బాలునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సర్దుబాటు గందరగోళం

● హైస్కూళ్లలో ఎస్‌ఏలకు బదులు ఎస్‌జీటీలు.. ● పలు పాఠశాలల్లో తీరని సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ● జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీలకు నియామకాలు ● సంఘాల విజ్ఞప్తుల్ని బుట్టదాఖలు చేశారని ఆందోళన

గుంటూరు(విద్య), ఆగస్టు 20: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రారంభమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రి య అనేక చోట్ల గందరగోళంగా మొద లైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో మంగళవారం నుంచి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రారంభమైంది. మండల స్థాయిలోని పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేసేలా ఎంఈవోలు కౌన్సెలింగ్ ప్రకియ నిర్వహించారు. అయితే ఇదీ అనేక ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా సాగినట్లు సంఘాల నాయకులు, కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల మెరిట్ కం రోస్టర్ పాటించలేదని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో జూనియర్లకు ఒక న్యాయం సీనియర్లకు మరో న్యాయం జరిగినట్టపోయారన్నారు. ఎస్‌జీటీ సీనియార్టీ జాబితాను విడుదల చేయలేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

● గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో దాదాపు నెల క్రితమే ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే అదనపు ఉపాధ్యాయుల్ని 5 నుంచి 15 మంది వరకు సర్దుబాటు చేశారు. తాజాగా మరోసారి సర్దుబాటుతో మళ్లీ వారితో బోధన చేయించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని హెచ్‌ఎంలు వాపోతున్నారు.

● పల్నాడు జిల్లా రాజుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఇద్దరు ఎస్‌జీటీలను సర్ ప్లస్ పేరుతో బయటకు పంపారు. ఇక్కడ స్కూల్ అసిస్టెంట్స్ స్థానంలో ముగ్గురు ఎస్‌జీటీలను నియమించారు.

● గుంటూరు పశ్చిమ మండలం నల్లపాడు జడ్పీ స్కూల్ నుంచి గుంటూరు తూర్పు మండలం ఏటుకూరులో స్కూల్‌లో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు.

● మాచర్లలో సీనియర్ ఉపాధ్యాయుల నుంచి విల్లింగ్(అనుమతి) తీసుకోకుండా, అదనంగా ఉన్న జూనియర్ టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు.

● అనేక స్కూల్స్‌లో ఒక సబ్జెక్టు బదులు మరో సబ్జెక్టు ఉపాధ్యాయుల్ని నియమించారు. దీనివల్ల కొరత తీరినా సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● గత ఐదేళ్లుగా మున్సిపాల్టీల్లో, కార్పొరేషన్ పరిధిలో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించలేదు. అదేమని ప్రశ్నిస్తే రూల్స్‌లేవని అధికారులు సమాధానం చెబుతున్నారు. అయితే జడ్పీ స్కూల్స్ నుంచి మున్సిపాల్టీల్లోని పాఠశాలలకు, మున్సిపల్ స్కూల్స్ నుంచి జడ్పీ స్కూల్స్ ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేస్తున్నారు. ఇది ఎలా సాధ్యామని ప్రశ్నించినా సమాధానం లేదని సంఘాల నాయకులు వాపోతున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో ఐటీ సెల్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సర్దుబాటు జరు గుతుందని ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.



● సర్దుబాటు కోసం ఎమ్మార్సీకి వచ్చిన ఉపాధ్యాయులు

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జ్యూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BYXem1hలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Alstom India

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.

- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AISDG7

Legrand Empowering

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు



ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.

అందరికీ ధన్యవాదాలు



తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటకు రాకుండా ఇన్నాళ్లు ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

● షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.

● ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం... అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.

● షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్ల తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటి స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

● కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.

● అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.

ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి

రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యునల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకొని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!



శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్స్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవకుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. అమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!

అసూయతో వచ్చిన మాటలవి






ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ, 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..

విడుదల తేదీ మారింది



వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తన కంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మెట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!



నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ప్రజాదర్బార్‌కు వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

● సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: మంత్రి లోకేశ్



దివ్యాంగుల సమస్యలు వింటూ భరోసా ఇస్తున్న లోకేశ్

తాడేపల్లి టౌన్, ఆగస్టు 20: భూవివాదాలపై ప్రజల నుండి ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నందున ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. సంబంధిత శాఖతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉండవల్లిలోని నివాసంలో 28వ రోజు మంగళవారం ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. ఆయా విజ్ఞప్తులను పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణం కోసం పెదవడ్లపూడికి చెందిన 40మంది వృద్ధులు కలిసి సేకరించిన రూ.28వేల విరాళాన్ని ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి అభినందనలు తెలిపారు.

మంగళగిరి నియోజకవర్గం నుండి వచ్చిన విన్నపాలు ...

మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన రైతులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. వైసీపీ అండతో గ్రామంలోని ఉప్పల పాటి చెరువు కట్టను కొంతమంది ఆక్రమించారని, దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. పెదవడ్లపూడిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న 40 ఎకరాల రైతు పట్టా భూములను 2010లో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రికార్డులు పరిశీలించి 22-ఎ నుండి తమ భూములు తొలగించాలని గ్రామానికి చెందిన బాధిత రైతులు కోరారు. దివ్యాంగుడనైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన షేక్ మౌలాలి విజ్ఞప్తి చేశారు. చిట్యాల ఐలమ్మ రజక ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని ఉండవల్లి గ్రామానికి చెందిన రజక సోదరులు కోరారు. బీకామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దుగ్గిరాలకు చెందిన చల్లపల్లి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు...

నెల్లూరు జిల్లా సైదాపురం రెవెన్యూ పరిధిలో వంశపారంపర్యంగా వచ్చిన తన రెండెకరాల భూమిని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అండతో కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన రావిళ్ల శ్రీనివాసనాయుడు విజ్ఞప్తి చేశారు. పోలియో వ్యాధి బారినపడి మంచానికే పరిమితమైన తనకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఎం మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు. పుట్టుకతో దీర్ఘకాలం చర్మవ్యాధి బారినపడిన తమ కుమారుడికి పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మద్దిగుంట జగదీష్ చంద్రప్రసాద్ కోరారు. చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన యూనియన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు ఆదేశాలు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. స్టీల్ ఎక్స్‌చేంజ్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం సేకరించిన తన 18 సెంట్ల స్థలానికి నష్టపరిహారం చెల్లించలేదని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన కళ్లేపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. అనియత విద్య బోధక, పర్యవేక్షకులకు అర్హతను బట్టి వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో నియమించాలని నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్స్ అండ్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న బీఈడీ, రికార్డు ఫీజులు తగ్గించాలని ఎస్ఎస్‌యూఐ ప్రతినిధులు కోరారు. పార్ట్‌టైం జాబ్ ఆశచూపి నకిలీ బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.16లక్షల వరకు సైబర్ నేరానికి పాల్పడ్డారని విచారించి తగిన న్యాయం చేయాలని తిరుపతి జిల్లా కామకూరుకు చెందిన వీ గురేష్ కోరారు. కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్య సాయం నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తిరిగి మంజూరు చేయాలని కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన గొల్లమందల శ్రీను కోరారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కాంట్రాక్ట్ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.



వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 20: రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లో సమస్యలు, సౌకర్యాల లేమి ఉన్న ఎడల సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. అనకాపల్లి హాస్టల్ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలోని హాస్టల్స్, వసతిగృహాలు, అనాథాశ్రమాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని తెలిపారు. పురుషోత్తమపట్నంలో మంగళవారం గిరిజన సంక్షేమ పాఠశాల వసతి గృహాన్ని ప్రత్తిపాటి తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతుల కల్పనలో నిర్లక్ష్యం గురించి విద్యార్థులు ప్రత్తిపాటి ఎదుట ఏకరువు పెట్టారు. మరుగుదొడ్ల దుస్థితి, భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయని, వాన వస్తే నీరుగారి సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పందిస్తూ పాఠశాల వసతిగృహంలో సమస్యలు, వసతుల కల్పన గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణితో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని, వారి సంఖ్యను పెంచటంపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇకపై క్రమం తప్పకుండా నియోజక వర్గ పరిధిలోని అన్ని వసతిగృహాలను తరచూ సందర్శిస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమస్యలు ఏమున్నా ధైర్యంగా తమ దృష్టికి తీసుకు రావచ్చని, బాధ్యులపై చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు.

అమ్మనందుకు ఆక్రమించారు

● న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే నరేంద్రవర్మను కోరిన బాధిత మహిళ

● న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత మహిళ రహంతున్నీసా

బాపట్ల, ఆగస్టు 20: ఎంతో విలువైన తన భూమిని అమ్మాలని వచ్చిన వారిని నిరాకరించినందుకు వైసీపీ శ్రేణులు సర్వే నెంబరు మార్చి 19 సెంట్ల భూమి ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధిత మహిళ రహంతున్నీసా మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. తన తల్లి పసుపుకుంకుమ కింద తనకు 50 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, సదరు భూమిపై కన్నేసిన వైసీపీ నాయకులు నాగరాజు, రాఘవరెడ్డి, చెన్నకేశవరెడ్డిలు పొలం అమ్మాలని అడిగితే నిరాకరించినందుకు 19 సెంట్ల భూమిని ఆక్రమించి నరసరావుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఎమ్మెల్యేకు వివరించింది. తన భూమి తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరింది. దీనిపై ఎమ్మెల్యే నరేంద్రవర్మ స్పందిస్తూ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. వైసీపీ పాలనలో ఐదారుగురు భూ కబ్జాలకు పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అన్నీ బయటకు తీసి నష్టపోయినవారికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. సూర్యలంకరోడ్డులోని బ్లూప్లేట్ హోటల్ దగ్గర 19 సెంట్ల భూమిని ఆక్రమించినవారికి శిక్షపడేలా చూస్తామన్నారు. భూమిని తిరిగి ఇప్పిస్తామని హామీనిచ్చారు. ఈ విషయంలో ఏ ఒక్కరికి నష్టం జరగకుండా ఆక్రమించిన భూములన్నీ వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

తెనాలిలో నిహారిక సందడి

● కమిటీ కుర్రోళ్లు చిత్ర యూనిట్ సందర్శన



ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న నిహారిక

తెనాలి అర్బన్, ఆగస్టు 20: సినీ నిర్మాత, నటి కొణిదల నిహారిక మంగళవారం తెనాలిలో సందడి చేశారు. ఆమె నిర్మాతగా తీసిన సినిమా కమిటీ కుర్రోళ్లు ప్రదర్శిస్తున్న తెనాలి ప్రియ థియేటర్‌కు చిత్ర యూనిట్‌తో కలిసివచ్చారు. అప్పటివరకు సినిమా చూస్తున్న ప్రేక్షకులు ఒక్కసారిగా వచ్చినవారిని చూసి కేరింతలు కొట్టారు. ప్రేక్షకులను ఉద్దేశించి నిహారిక మాట్లాడుతూ, ప్రేక్షకులకు సినిమా బాగా నచ్చిందని, మంచి ఆదరణ లభించిందన్నారు. సినిమా బాగా రావడంతో చిరంజీవి సైతం యూనిట్ అంతటిని ఇంటికి పిలిచి అభినందించారని చెప్పారు. ఆయన సపోర్టు చాలా సంతోషం ఇచ్చిందన్నారు. మంచి చిత్రాలు నిర్మించేందుకు కృషిచేస్తామన్నారు. చిత్రయూనిట్‌కు జనసేన నాయకులు, థియేటర్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. జనసేన రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో విప్పల్స్ సర్జరీ!

● సంక్లిష్టమైన, ప్రాణాధార శస్త్రచికిత్స నిర్వహణ

● ఆపరేషన్‌కు ముందు పారిపోయిన రోగి

● వైద్యుల అభయంతో సర్జరీ చేయించుకున్న వైనం



ఆంధ్రయ్యతో వైద్యులు కిరణ్‌కుమార్, కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు(మెడికల్), ఆగస్టు 20: తనకు జరగబోయేది అత్యంత క్లిష్టమైన ఆపరేషన్.. ఏడు గంటలపాటు ఐదు దశల్లో జరిగే ఈ సర్జరీ ఏ దశలో సరిగ్గా చేయకపోయినా ప్రాణాలు గాలిలో కలసిపోతాయి. ఈ విషయం తెలుసుకున్న రోగి.. ఆపరేషన్‌కు ముందు వార్డు నుంచి పారిపోయాడు. కుటుంబసభ్యులు, వైద్యులు నచ్చచెప్పడంతో అయిష్టంగానే తిరిగొచ్చి ఆసుపత్రిలో చేరాడు. ఎట్టకేలకు డాక్టర్లు ఆపరేషన్ చేశారు. రోగి భయపడినట్లు ప్రాణాపాయం సంభవించలేదు. ఈ శస్త్రచికిత్సతో రోగికి ప్రాణాపాయం తప్పింది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాట్లో ఉండే, సంక్లిష్టమైన, సాంకేతికంగా ఉన్నతమైన విప్పల్స్ సర్జరీని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో తొలిసారిగా విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రి శుశ్రుతహాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ సర్జరీ వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన వ్యవసాయ కూలి కేతవరపు ఆంధ్రయ్య కొంతకాలంగా ప్యాంక్రియాటిక్ కేన్సర్‌తో బాధపడున్నాడు. చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. ఇతడికి ఆపరేషన్ చేయడమే మార్గంగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రోగి పిత్తాశయం, ప్యాంక్రియాస్ తల భాగం, చిన్నపేగు ప్రారంభ ప్రాంతం, ఇలా ఐదు ప్రాంతాలను కత్తిరించి తిరిగి జీర్ణవ్యవస్థకు జాగ్రత్తగా అతికించాలి. వీటిలో ఏ ఒక్కటి సరిగ్గా అతుక్కోకపోయినా రోగికి ప్రాణాపాయం పొంచి ఉంటుంది. ఈ విషయం తెలిసి రోగి ఒకసారి ఆసుపత్రి నుంచి పారిపోయాడు. వైద్యులు నచ్చచెప్పి, విజయవంతంగా ఆపరేషన్ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.10లక్షలు ఖర్చయ్యే ఈ ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచితగా చేసినట్లు డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు తెలిపారు. తనకు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణభిక్ష పెట్టిన వైద్యులకు రోగి ఆంధ్రయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కటక్-హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా కటక్, హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07165 హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకు ప్రతీ మంగళవారం రాత్రి 8.10కి బయలుదేరి సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ మీదగా అర్ధరాత్రి దాటాక 12.33కి సత్తెనపల్లి, 1.25కి గుంటూరు, మరునటి రోజు సాయంత్రం 5.45కి కటక్ చేరుకొంటుంది. నెంబరు 07166 కటక్ - హైదరాబాద్ రైలు ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి గురువారం మధ్యాహ్నం 1.30కి గుంటూరు, 2.15కి సత్తెనపల్లి, రాత్రి 7.45కి సికింద్రాబాద్, 9గంటలకు హైదరాబాద్‌కు చేరుకొంటుందన్నారు. ఈ రైళ్లలో స్లీపర్, ఏసీ త్రీ, టూ టైర్ బోగీలుంటాయని డీఆర్ఎం తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి



తిరుపతమ్మ మృతదేహం

రేపల్లె, ఆగస్టు 20: పొలంలో మంగళవారం ఉదయం నాట్లు వేస్తుండగా పిడుగు పడటంతో మహిళ మృతిచెందిన ఘటన అమృతలూరు మండలం కాంచాలవరం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన వారే తిరుపతమ్మ(38) వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలం కాంచాలవరం గ్రామంలో పొలంలో నాటు వేసేందుకు వెళ్ళింది. సుమారు 11.30 గంటల సమయంలో చిన్నపాటి గాలులతో వర్షం కురుస్తుండటంతో నాట్లు వేసే సమయంలో పిడుగు పడి తిరుపతమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమెకు భర్త గతంలోనే చనిపోయాడు. కుటుంబ పోషణకై కూలిపనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నది. తల్లి మరణవార్త విని పిల్లలు బోరున విలపిస్తుంటే చూపరులను కంటతడిపెట్టించింది.

మధ్యాహ్న సమయంలో ఇంటిలోకి చొరబడి వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ


పెదకూరపాడు, ఆగస్టు 20: పెదకూరపాడులో 70 సంవత్సరాలు పైబడిన ఓ వృద్ధురాలి ఇంట్లోకి మంగళవారం దర్జాగా వెళ్ళి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు చైన్‌ను లాక్కొని ఆమెపై దాడి చేసిన సంఘటన ఇది. ఎస్ఐ బాణావత్ బాలునాయక్, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడుకు చెందిన చుండు సీతామహాలక్ష్మి (72) తన ఇంటి వరండా లో మంచంపై పండుకొని నిద్రిస్తుండగా వంట గదిలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. వంట గదిలోకి సీతామహాలక్ష్మి వెళ్ళి చూడగా అప్పటికే ఆ గదిలో ఉన్న వ్యక్తి సీతామహాలక్ష్మి పక్కనే ఉన్న కుర్చీలోకి నెట్టి చీరతో కుర్చీకి కట్టారు. నోరు మూయటంతో పాటు ఆమెను కొట్టారు. నా గురించి చెపితే చంపుతానంటూ బెదిరించి పరిగెత్తుకుంటూ వెళ్లాడు. ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద మరో వ్యక్తి స్కూటర్ స్టార్ట్ చేసి ఉండటంతో దానిపై ఎక్కి శ్మశానం మీదుగా అమరావతి రోడ్డు వైపు వెళ్ళినట్టు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారుగా పోలీసులు సీసీ కెమె రాల్లో చూసిన ఆనవాళ్ళ ప్రకారం అంటున్నారు. అందరూ తిరుగుతుండగానే ఘటన జరగటం పెదకూరపాడులో చర్చనీయాంశంగా మారింది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బాలూనాయక్ పరిశీలించి సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ముగ్గురి ఎంపిక

మంగళగిరి సిటీ, ఆగస్టు 20: కోల్‌కతాలో ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు మహిళా లిఫ్టర్లు ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తెలియజేశారు. 57 కిలోల విభాగంలో షేక్ సాదియా అల్మాస్ (మంగళగిరి), 84 కిలోలు పైబడిన విభాగంలో బొల్లినేని చంద్రిక (మంగళగిరి), 84 కిలోల విభాగంలో షేక్ షబ్బీనా (తెనాలి) ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీలకు ఎంపికైన మహిళా లిఫ్టర్లను అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎన్ వంశీకృష్ణ, జీ వెంకటేశ్వర రావు, బి.ప్రసాద్, పీ భాస్కర్, ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌డీ మస్తాన్‌వలి, జీ మల్లేశ్వరరావు, ఆళ్ల పవన్‌కుమార్, పీ సందీప్, ఎస్‌కే సుభానీ, కే మధుబాబు తదితరులు అభినందించారు.



ఎంపికైన మహిళా లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు 18,250 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 20: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 35వేల 727 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18వేల 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 477 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 20: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,212 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 47,212 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 29 వేల క్యూసెక్కులు నీరు విడుదల


● 1.02 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 20: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 3 క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21వేల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8వేలు మొత్తంగా 29వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.02 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 7.02 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.45 మీటర్లకు సమానమన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 20: పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు పిడుగురాళ్ల స్టేషన్ దాటిన కొద్ది సేపటికే ఓ వ్యక్తి రైలు పట్టాల మధ్య కూర్చొని ఉన్నట్లు గుర్తించిన లోకో పైలెట్ రైలును నిలిపివేసేందుకు ప్రయత్నించే లోగా రైలు ఆ వ్యక్తిని ఢీకొట్టింది. వెంటనే రైలును నిలిపి వేసి మృతదేహాన్ని పరిశీలించగా రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రైలుపట్టాల మధ్య లో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ప్రయాణికుల సాయంతో బయటకు తీసి 108కు ఫోన్‌చేసే లోపు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. 45సంవత్సరాల వయసు కలిగి ఉన్న ఆ వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

అనారోగ్యం... యువకుడి ఆత్మహత్య



మరియదాసు(ఫైల్)

ఫిరంగిపురం, ఆగస్టు 20: ఫిరంగిపురంలోని శాంతిపేటకు చెందిన టప్పెట మరియదాసు(21) అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు గడ్డి మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడని బంధువులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

55,420 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 58,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 55,420 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 22,845 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	800017500		334	8000	15000
నెంబరు. 5	10500	14500	నెంబరు. 5	11000	11500
273	10800	14500	273	12000	12000
341	10000	14500	341	10000	16000
4884	11800	11800	4884	11800	11800
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	8500	18900
బ్యాడిగి	8200	14000	బ్యాడిగి	10000	14500
దేవనూరుడీలక్స్	10000	12800	దేవనూరుడీలక్స్	11500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	4500	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

● సీఐ వెంకటరావు



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఎస్ వెంకటరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 20: పట్టణంలో ద్విచక్ర వాహనాలు మైనర్లు నడుపుతున్నట్లు గుర్తిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ ఎస్ వెంకటరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న పలువు రు మైనర్లను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ : ఎస్ఐ



మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, ఆగస్టు 20: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం కసూర్బా పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, చట్ట వ్యతిరేక చట్టాలపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్, రోడ్డు సేఫ్టీపై కాలేజీ విద్యార్థులకు అవగాహన



ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీష్ తదితరులు

మాచవరం, ఆగస్టు 20: మాచవరంలో నిర్వహిస్తున్న శ్రీవిజేత జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, రోడ్డు సేఫ్టీ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ సతీష్ ముఖ్యఅతిథి గా హాజరై విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్, రోడ్డు సేఫ్టీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, దానివల్ల అనేక అనర్థాలు కలుగుతాయని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దు

బెల్లంకొండ, ఆగస్టు 20 : హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దని పెదకూరపాడు సీఐ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో ద్విచక్ర వాహనదారుల కు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసి చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. దీనివల్ల కుటుంబాలు చిన్నాభిన్నమై పోతాయని తెలిపారు. హెల్మెట్‌తో ప్రయాణం చేయటం వల్ల సురక్షితంగా గృహాలకు చేరుతారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు గురై చాలా మంది అంగవైకల్యానికి గురైన వారు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ బెన్‌హరి, హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మాగులూరి ఫౌండేషన్ ల్యాప్ ట్యాప్ అందజేత

పెదకూరపాడు, ఆగస్టు 20: మాగులూరి ఫౌండేషన్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థికి మండలంలోని హుస్సేన్ నగరంలో మంగళవారం అందించారు. క్రోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన నందు అనే ఇంజనీరింగ్ విద్యార్థి కి కిట్ కళాశాలలో నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థికి ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ తనయులు అర్జున్, సిద్ధార్ధ్ చేతుల మీదుగా వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కొండవీటి ప్రసాదు, కుంచనపల్లి కిరణ్ ఉన్నారు

దోమల నిర్మూలనా దినోత్సవం




దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేజీబీవీ పాఠశాల వద్ద ప్రదర్శన

సత్తెనపల్లి, ఆగస్టు 20: పట్టణంలోని కేజీబీవీ పాఠశాల వద్ద మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దోమల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం ప్రసన్న రాణి, భార్గవి, రాజమ్మ, హుస్సేన్, రోశయ్య రాజేష్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, ఆగస్టు 20: పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కృష్ణవేణి విద్యార్థి ప్రతిభ



రాకేష్ రణదీర్ యాదవ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య

మాచర్లటౌన్, ఆగస్టు 20: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఈనెల 18వ తేదీన నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలకు చెందిన రావమంటి రాకేష్ రణదీర్ యాదవ్ ప్రతిభ చూపారు. సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో 73 కేజీల విభాగంలో ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం రాకేష్ రణదీర్ యాదవ్‌ను కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య అభినందించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కారంపూడి, ఆగస్టు 20: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పర్యావరణ వేత్త కొమెర జాజి అన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో గల కాకతీయ పబ్లిక్ స్కూల్లో మంగళవారం ప్రకృతి, అడవులు సంరక్షణ, వృద్ధిపై విద్యార్థులకు బోధించారు. పంచభూతాలు కలుషితం కాకుండా చూడాలన్నారు. 1952 జాతీయ అటవీశాఖ తీర్మానం ప్రకారం 33.3 శాతం ప్రకృతి అడవులు ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ విత్తన బంతులు చల్లుతూ, మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్డు సైజ్ ఎందుకు తగ్గింది.. ముద్రలు లేవెందుకు?

● వాళ్ల పిల్లలకు ఈ గుడ్లే వండి పెడతారా

● చిన్న పిల్లలంటే అంత చులకనా

● కాంట్రాక్టర్లపై మండిపడ్డ కలెక్టర్ పి.అరుణ్‌బాబు



విద్యార్థులకు అందచేస్తున్న గుడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రెంటచింతల, ఆగస్టు 20: అంగన్‌వాడీలకు, మండల పరిషత్ పాఠశాలలకు సరఫరా చేసే గుడ్డు సైజు ఎందుకు తగ్గింది.. వాటి మీద ముద్రలు ఎందుకు లేవు.. ఈ విషయాన్ని మీరు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారా లేదా.. పరిమాణంలో ఇంత చిన్న గుడ్లను సరఫరా చేసి చిన్నారులు పౌష్టికంగా ఉండాలంటే ఎలా అంటూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా గోలి గ్రామాన్ని సందర్శించారు. తొలుత 1 అంగన్వాడీ కేంద్రాన్ని ఆ తరువాత మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. చిన్నారుల బరువును పరిశీలించారు. పౌష్టికాహారానికి సంబంధించి ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లను చూడాలని తహసీల్దార్ కరుణకుమార్‌ను ఆదేశించారు. నిత్యావసర సరుకుల నాణ్యతను చూశారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలను సందర్శించగా విద్యార్థులు బోర్ నీటిని తీసుకుని రావడాన్ని కలెక్టర్ తప్పుపట్టారు. ఆర్వో ప్లాంట్ ఏమైంది.. రిపేర్‌లో ఉందని చెప్పగా ప్రత్యామ్నాయంగా శుద్ధజలాన్ని అందివాల్సిందేనని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వీటికి సంబంధించిన వివరాలన్నింటిని తక్షణమే అందచేయాలని తహసీల్దార్, విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఈవో వి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కరుణకుమార్, ఎంఈవో-2 శివనాగేశ్వరరావు, సూపర్‌వైజర్, టీచర్లు తదితరులున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో తనిఖీ

గురజాలటౌన్, ఆగస్టు 20: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి రోజు ఆస్పత్రికి ఎంత మంది వస్తున్నారని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుధీర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సరిపడిన మందులు ఉన్నాయా లేదా అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని రోగుల ద్వారా తెలుసుకున్నారు. వైద్యం అందక రోగులు ఇబ్బం ది పడకూడదని వైద్యులకు సూచించారు. జ్వరాల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ నగేష్ తదితరులు ఉన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అటవీ హక్కుల పాసు పుస్తకాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన నాగోతు శౌరయ్య తదితరులు

నకరికల్లు, ఆగస్టు 20 : గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నకరికల్లుకు చెందిన 55 మంది గిరిజనులకు 86.40 ఎకరాల అటవీ భూములు సాగు చేసుకొనేందుకు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే కన్నా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ 2005కు ముందు అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు జీవనోపాధి కల్పించేందుకు అటవీ హక్కుల చట్టాన్ని 2006లో అమల్లోకి తెచ్చారన్నారు. తాను ఆ సమయంలో మంత్రిగా ఉన్నానని తెలిపారు. ఈ భూములను సాగు చేసుకొని ఫలసాయాన్ని పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ భూములను అమ్ముకోవటానికి హక్కులు ఉండవని స్పష్టం చేశారు. గిరిజనుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనులు భూములు సాగు చేసుకొని ఆదాయాలను పొందటం మంచి పరిణామమన్నారు. వైసీపీ హయాంలో గిరిజనుల, దళితుల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి 27 పథకాలను రద్దు చేశారన్నారు.

ఆలయం వద్ద అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

నకరికల్లు కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. దేవాలయ గదుల నిర్మాణానికి భూమి పూజ సమయంలో స్థానికులు ఈవో వెంకయ్య ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయించాలని కన్నాను కోరారు. తొలుత లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ప్రదక్షిణలు చేసి కన్నా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి లోతేటి వరలక్ష్మి, పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి వీరాంజనేయులు, టీడీపీ నేతలు కన్నా ఫణీంద్ర, నాగోతు శౌరయ్య, సింగరాజు సాయికృష్ణ, షేక్ అలీ బాషా, సాగి శ్రీనివాసరావు, పాలడుగు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, బత్తిన కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రవీణ్ రూ.లక్ష వితరణ

● మాజీ ఎంపీపీ బాబూరావు రూ.25వేలు వితరణ



ప్రధానోపాధ్యాయులుకు ఎమ్మెల్యే ప్రవీణ్ పంపిన రూ.లక్ష అందిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్, మద్దినేని తదితరులు

పెదకూరపాడు, ఆగస్టు 20: పెదకూరపాడు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపించిన లక్ష రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణకు టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ అందించారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కూడా డయల్ యువర్ ఎమ్మెల్యే ప్రవీణ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రజా ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు దగ్గరయ్యారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చి లక్ష రూపాయలను ప్రకటించి నేడు ఆ నగదును పంపించారని ప్రవీణ్ సేవలను మరువలేమన్నారు. మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరు అభివృద్ధికి చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, ఉపసర్పంచ్ జాగర్లమూడి రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు నాడు ప్రకటించిన రూ.25వేలును అందించారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సత్తెనపల్లి, ఆగస్టు 20: పట్టణ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో మాదంశెట్టి వేద్రాద్రి, చాంద్‌బాషా, కోటా ఆనంద్, ఎం శంకరరావు, శేఖర్, మోహనరావు, మస్తాన్‌వలి, సాంబశివరావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, ఆగస్టు 20 : మాజీ ప్రధాని నవోదయ విద్యాలయాలను ప్రవేశపెట్టి గ్రామీణులకు ఉన్నత విద్యను అందచేసిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెంటచింతల, జెట్టిపాలెం గ్రామాల్లోని రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కోటయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీనునాయక్, గంగిరెడ్డి, కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షులు విద్యావేత్త శ్రీనివాసరావు, జాకబ్ రాజ్, కొమ్ము మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి, ఆగస్టు 20: భారతదేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకులు కరాలపాటి జాని అన్నారు. మంగళవారం దాచేపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకటాయపాలెంలో వైద్యశిబిరం

బెల్లంకొండ, ఆగస్టు 20: మండలంలోని వెంకటాయపాలెంలో మంగళవారం చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న నలుగురిని గుర్తించి రక్త నమూనాలను సేకరించారు. సాధారణ రుగ్మతతో బాధ పడే వారిని గుర్తించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జానీ బాషా, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



గృహాలపై పడిన భారీ వృక్షం

మాచర్లరూరల్, ఆగస్టు 20: మండలంలోని విజయపురిసౌత్‌లో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. నీటైపులోని 26, 27 నంబర్లు గల గృహాలపై భారీ వృక్షం కూలి పడింది. దీంతో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. రూ. 1.50 లక్షల ఆస్తినష్టం వాటిలినట్లు బాధితులు గంటెనపల్లి రమేష్, సీహెచ్ రాజులు వాపోయారు. రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న గృహాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

అత్యాచార కేసుపై డీఎస్పీ విచారణ

బెల్లంకొండ, ఆగస్టు 20: మండలంలోని రామాంజనేయపురంలో రెండు రోజుల క్రితం జరిగిన అత్యాచార కేసుపై సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. రామాంజనేయపురం గ్రామానికి చెందిన నెల్లూరి లోకేశ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఇంట్లో ఉండగా ఆమెపై అత్యాచార యత్నం చేశాడని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే డీఎస్పీ గురునాథబాబు విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లి బాధితులతో, చుట్టు పక్కల వారితో విచారణ చేపట్టారు. ఈ విచారణలో పెదకూరపాడు సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని చట్టపరంగా శిక్షించాలి : ఐద్వా నాయకులు

సత్తెనపల్లి, ఆగస్టు 20: అత్యాచార యత్నం కేసులో నిందితుడిని చట్టపరంగా శిక్షించాలని ఐద్వా నాయకులు గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజిని, జడ స్పందనలు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఏరియా వైద్యశాలలో బాధితురాలిని పరామర్శించి, ఆమె కుటుంబసభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ప్రమోషన్‌లు ఇచ్చి సర్దుబాటు చేయాలి

సత్తెనపల్లి, ఆగస్టు 20: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టే ముందు ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్‌లకు హైస్కూల్ హెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలుగా ప్రమోషన్‌లు ఇచ్చిన తరువాత వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లు చేపట్టాలని ఎస్టీయూ(ఏపీ) రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ ఎం సుభానీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దీనివల్ల ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రతి జిల్లాలో ఏడు నుంచి ఎనిమిది వందల వరకు విరమణ పొందే ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయన్నారు. కొన్ని జిల్లాల్లో ప్రమోషన్ ప్రక్రియ ఇంత వరకు చేపట్టలేదన్నారు. ఆ దిశగా ఆలోచించి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

శివాలయంలో అమ్మవారికి అభిషేకం



శివాలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పిడుగురాళ్ల, ఆగస్టు 20: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని స్థానిక శివాలయంలో కనకదుర్గ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మహిళలు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తురకపాలెంలో చోరీ

మాచవరం, ఆగస్టు 20: మండలంలోని తురకపాలెం గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సైదాబి గృహంలో రూ.20 వేల నగదు, రూ.10 వేల విలువ కలిగిన బంగారం చోరీ జరిగిందని ఎస్ఐ సతీష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సైదాబి బజారుకు వెళ్లగా ఇంట్లో కుటుంబసభ్యులు తాళం వేసి బయటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ చేసినట్లు తెలిపారు. సైదాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 20: రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి కలిశారు. ఉండవల్లిలోని మంత్రి లోకేష్ గృహంలో కలిసి మాచర్ల నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

గాయపడిన వారికి జనసేన ఆర్థికసాయం



ఆర్థికసాయం చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

క్రోసూరు, ఆగస్టు 20: నెల రోజుల క్రితం శ్రీశైలం సమీపంలో రోడ్డు ప్రమాదం జరగ్గా క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామానికి చెందిన కొంత మందికి గాయాలయ్యాయి. బాధితులకు జనసేన నాయకులు సోమవారం రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. బాధితులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు సూదా సాంబశివరావు రూ.50వేలను ఆర్థిక సాయంగా పంపించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారికి ఏ కష్టం మొచ్చినా ఆదుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గ్రామంలో జనసేన పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు యర్రంశెట్టి రామకృష్ణ, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు శాఖమూరి శ్రీనివాసరావు, సురేష్, ఐదు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

వైద్యుడి కుటుంబానికి చెక్కు అందజేత



డాక్టర్ చల్లా వెంకటేశ్వరరెడ్డి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు భరత్‌కుమార్

పిడుగురాళ్ల, ఆగస్టు 20: పట్టణంలో 1983లో వివేకానంద నర్సింగ్ హోం స్థాపించి పల్నాడు ప్రజలకు వైద్య సేవలు అందజేసిన డాక్టర్ చల్లా వెంకటేశ్వర రెడ్డి కుటుంబానికి ఐఎంఏ నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్ కింద రూ.18 లక్షల చెక్కును మంగళవారం స్థానిక ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి బొర్రా రాంప్రసాద్, సీనియర్ వైద్యులు బాదం శివారెడ్డి, తదితరులున్నారు. గతంలో 11 లక్షల 24 వేల 500 రూపాయల చెక్కును డాక్టర్ వెంకటే శ్వరరెడ్డి భార్య వెంకటలక్ష్మి, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు.

ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ చదవొచ్చు

● స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్ అక్బర్ అలీ



ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్ అక్బర్ అలీ

నకరికల్లు, ఆగస్టు 20: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ)లో దూర విద్యావిధానం ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదువొచ్చని స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్ అక్బర్ అలీ అన్నారు. మంగళవారం నకరికల్లు వంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూల్ నందు ఓపెన్ స్కూల్ ప్రవేశానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఉపాధ్యాయులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 - 25 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. చదవటం, రాయటం తెలిసి 14 సంవత్సరాలు నిండిన వారు 10వ తరగతి పరీక్షలు రాయవచ్చని, 10వ తరగతి పాసై 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్ చదవొచ్చని తెలిపారు. బడిలో మధ్యలో మానివేసిన వారు, పాఠశాలకు వెళ్లి చదవటం వీలు కాని వారు ఓపెన్ స్కూల్ విధానంలో 10వ తరగతి, ఇంటర్ చదవ వచ్చని తెలిపారు.

కోల్‌కతా ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి



రెంటపాళ్లలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 20: కోల్‌కతా హత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రెంటపాళ్లల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటన మానవజాతికే మాయని మచ్చగా మిగులుతుందన్నారు. మహిళలపై రోజురోజుకు దాడులు జరుగుతున్నా ప్రభుత్వం సరైన విధంగా స్పందించక పోవటం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని, దోషులను వెంటనే శిక్షించాలని ర్యాలీలో నినాదాలు చేశారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ జిల్లా కో- కన్వీనర్ అమూల్య, ఐద్వా జిల్లా నాయకురాలు అనూష, చంద్రిక, వినీత, రష్మిత, భార్గవి, సాయి, శైలు తదితరులు పాల్గొన్నారు.

1200 పశువులకు గాలికుంటు వ్యాధి టీకా

క్రోసూరు, ఆగస్టు 20 : క్రోసూరు పశు వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మూడు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడిపాడు, పారుపల్లి, క్రోసూరు గ్రామాల్లో మొత్తం 1200 పశువులకు టీకాలను వేసినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య తెలియజేశారు. కార్యక్రమంలో ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఇంటింటికి తిరిగి గాలికుంటు వ్యాధికి సంబంధించిన టీకాలను వేస్తామని, రైతులు, గేదెల పెంపకం దారులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటింటికి తిరిగి టీకాలు వేసిన వారిలో పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎస్ఐకు ఎమ్మార్పీఎస్ నాయకుల సత్కారం

మాచవరం, ఆగస్టు 20: మాచవరం పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్ఐ సతీష్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సత్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుము రమేష్ ఆధ్వర్యంలో నియోజక వర్గ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు హాజరై ఎస్ఐను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

హత్యాచారంపై విద్యార్థుల నిరసన



జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

వినుకొండ టౌన్, ఆగస్టు 20: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన జూనియర్ డాక్టర్‌పై లైంగికంగా దాడిచేసి, హత్యచేసిన నిందితులను వెంటనే ఉరితీయాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వినుకొండ పట్టణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు భారీర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ఉయ్‌వాంట్ జస్టిస్ నినాదాలతో మారుమోగాయి. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవపూడి రాము మాట్లాడుతూ దేశమంతా 78వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపు కుంటున్నవేళ, కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను అతికిరాతకంగా హత్యచేసిన వైనం దేశం యావత్తూ సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. గాంధీ మహాత్ముడు చెప్పిన విధంగా ఆడపిల్ల అర్థరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని తెలిపారు. తెల్లదొరలు దేశం వదిలినా, స్వాతంత్ర్యం రానట్లుగా, ఎక్కడ పడితే అక్కడ, వయస్సుతో సంబంధం లేకుండా హత్యలు, మానభంగాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య కేసులో నిజాలు, నిర్భయంగా వెలుగులోకి రావాలని, హంతకులను గుర్తించి, ప్రజల సమక్షంలో ఉరితీసేవరకు ఈ పోరాటాలు ఆగవని ఈ సందర్భంగా రాము కేంద్రాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కొప్పురపు మల్లికార్జునరావు, బిజయరామ్, ఆశోక్, ఆంజనేయులు, తారక్, లక్ష్మీ, ప్రసన్నపాటు సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు పరిహారమివ్వండి

● బీపీసీఎల్ అధికారికి కారుమంచి రైతుల విన్నపం

శావల్యాపురం, ఆగస్టు 20: కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు భారత్ పెట్రోలియం సంస్థ పైప్‌లైన్‌కు భూములిచ్చిన రైతులకు న్యాయమైన పరిహారాన్ని అందించాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన రైతులు బీపీసీఎల్ పైప్‌లైన్ అధికారి మల్లికార్జునరావుకు విన్నవించారు. కారుమంచిలో బీపీసీఎల్ పైప్‌లైన్‌కు భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులో ఏర్పడ్డ వివాదంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఏసీ తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు సమక్షంలో మంగళవారం విచారణ నిర్వహించారు. రైతుసంఘం నేతలు చేకూరి సురేష్, రాజా మాట్లాడుతూ పైప్‌లైన్‌ల నిర్మాణం వలన పొలాల్లో బోర్లు, బావులు ఏర్పాటుకు, వేర్లుపాకే పంటలు వేయడానికి వీలు లేకుండా పోతుందని, పైప్‌లైన్ వల్ల భూమి నిస్సారమవుతుందని, పంటల దిగుబడులు తగ్గుతాయన్నారు. ఇన్ని ఇబ్బందులున్నా సెంటు భూమికి రూ.1070 మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. గతంలో నియోజకవర్గంలో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రూ.10వేల నుండి 13వేలవరకు చెల్లించారన్నారు. న్యాయమైన పరిహారమిచ్చేవరకు బీపీసీఎల్ అధికారులను పొలాల్లోకి రానీయమని, పరిహారమిచ్చాకే పైప్‌లైన్‌ల నిర్మాణానికి అనుమతిస్తామని రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన బీపీసీఎల్ అధికారి మల్లికార్జునరావు పైప్‌లైన్ అథారిటీ డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడి తదుపరి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ముప్పా గిరిప్రసాద్, మన్నం వెంకటేశ్వర్లు, యర్రబిక్కి ఆంజనేయులు, ఇడుపులపాటి సురేష్, పిన్నెబోయిన నరేష్, పగిడి శ్రీరాములు, చుండూరి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తీసుకున్నా, విక్రయించినా జైలుకే: సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శోభన్‌బాబు

వినుకొండ టౌన్, ఆగస్టు 20: విద్యార్థులు డ్రగ్స్ తీసుకున్నా, విక్రయించినా జైలుకు వెళ్లటం ఖాయమని వినుకొండ పట్టణ సీఐ యు.శోభన్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు క్రమశిక్షణగా మెలిగినప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని, క్రమశిక్షణ లేని యువత జీవితంలో ఏమీ సాధించలేరన్నారు. ఎంతో మంది విద్యార్థులు చదువుకునే స్తోమత లేక, కూలి పనులకు పోతున్నారని, చదువుకునే అవకాశాన్ని పొందిన విద్యార్థులు జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాలకు వచ్చి బయట తిరగవద్దని, ఇప్పటికే కళాశాల పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో పోలీస్ నిఘా ఉంచామని హెచ్చరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులతో ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తే 9440796248 నెంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



ఓటర్ల సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎఫ్ఏసీ తహసీల్దార్ వెంకటనాగరాజు

ఓటర్ల సర్వేను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి

● ఎఫ్ఏసీ తహసీల్దార్ వెంకటనాగరాజు

శావల్యాపురం, ఆగస్టు 20: స్పెషల్ సమరీ- 2024లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికీ ఓటర్ల సర్వే ప్రక్రియను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్ఏసీతహసీల్దార్ వేముల వెంకటనాగరాజు తెలిపారు. శావల్యాపురంలో జరుగుతున్న ఓటర్లసర్వేని ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్ఏసీ తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో పేర్లుగానీ, చిరునామా గానీ, లింగం గానీ తప్పులుంటే సవరణ చేస్తామని, 18ఏళ్ళు నిండి స్థానికంగా నివాసముంటున్న అర్హులందరికీ ఓటుహక్కు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు, వలస కార్మికులు అక్కడ ఓటుహక్కు ఉన్నట్లయితే రెండోచోట ఓటును తొలగించేందుకు దరకాస్తు చేసుకోవచ్చన్నారు. చనిపోయిన వ్యక్తులను ఓటరు జాబితాల్లో తొలగించేందుకు దరకాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రబాబు, కార్యదర్శి మహేంధర్, వీఆర్వోలు మంగయ్య, రాధ, బీఎల్వో లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఏవో రామారావు

ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి

● ఇన్‌చార్జి ఎంఏవో రామారావు

శావల్యాపురం, ఆగస్టు 20: ఈ-పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం రైతులకు అన్ని రకాల రాయితీలను అందిస్తుందని, కాబట్టి ఈ-పంట నమోదు ప్రక్రియను వీఏఏలు వేగవంతం చేసి సెప్టెంబరు 15నాటికి పూర్తిచేయాలని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు అన్నారు. మండలంలోని శానంపూడిలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామారావు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలను నూరుశాతం ఈ-పంటలో నమోదు చేయాలని ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం వాటిల్లినపుడు రైతులకు ప్రభుత్వమందించే నష్టపరిహారం, రాయితీపై అందించే విత్తనాలు, ఎరువులు, పంట ఇన్సూరెన్స్, సున్నావడ్డీ పథకం, పంట కొనుగోళ్లను ప్రభుత్వం ఈ-పంట ఆధారంగానే అమలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో కౌలు రైతులకు 1890 సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించగా ఇప్పటికి 94శాతం పూర్తిచేశామన్నారు. అన్ని రైతు సేవాకేంద్రాల్లో ప్రభుత్వం రాయితీపై అందించే వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, నమోదు చేసుకొన్న రైతులకు రెండ్రోజుల వ్యవధిలో విత్తనాలు అందిస్తామన్నారు. అనంతరం రైతులకు వరి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, వీఏఏ ఇర్మియా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పట్టణంలోని మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 20: స్థానిక సంస్థలలోని సమలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం చిలకలూరిపేట మెయిన్ బజారు కేబీరోడ్డు, మార్కెట్ రోడ్డులోని మురుగు కాలువలను ప్రత్తిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్న సమస్యలను తొలగించటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, జవాబుదారీతనంతో స్థానిక సంస్థలను ముందు వరుసలో నిలపటమే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించిన స్థానిక సంస్థలకు చెందిన రూ.1452కోట్లను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో వాటిని విడుదల చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విధంగా పంచాయతీలు, మునిసిపాలిటీలకు నిధులకొరత లేకుండా చూసుకొనే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని, వాటి సాయంతో ప్రజల అవసరాలు, సమస్యలు తీర్చాల్సిన బాధ్యత మాత్రం స్థానిక సంస్థల పైనే ఉందన్నారు. మెయిన్ బజారులో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీరు రహదారిపై పారుతుందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వర్షాలు కురిసినప్పుడు మురుగు కాలువల్లో నీరు నిలిచి చాలా అసౌకర్యంగా ఉంటోందని చెప్పారు. మురుగు కాలువల్లో తక్షణమే వ్యర్థాలను తొలగించాలని ప్రత్తిపాటి ఆదేశించారు. కాలువలపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ సెంటర్ పరిధిలో వాహనాల పార్కింగ్ స్థలం లేక రహదారిపై నిలుపుతున్నారని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని, ఆ సమస్యపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. అధికారులంతా గత ప్రభుత్వ వాసనలను పూర్తిగా వదిలించుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకొని పనిచేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.

ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని... ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



హోమం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 20: రాష్ట్రంలో ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని అనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కూటమి ప్రభుత్వ ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు ప్రకృతి కూడా సహకరిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక శ్రీనివాస నగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో 38వ వార్షిక బ్రహోత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త కొణిచేటి నాగశ్రీను రాయల్‌లను ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హోమం కార్యక్రమంలో పాల్గొని వేదాశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ చంద్రబాబు వస్తే వానలు పడవవన్న వైసీపీ తప్పుడు ప్రచారాలకు జోరు వానలో వరుణుడే సమాధానం చెబుతున్నట్లు కనిపిస్తోందన్నారు. స్వల్ప వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలన్నీ నిండుకుండల్లా మారాయని, పల్లెసీమలన్నీ పచ్చతోరణంగా మారడం సంతోషంగా అనిపిస్తోందన్నారు. స్వామివారి దయతో కూటమి ప్రభుత్వంలో నీటి ప్రాజెక్టులన్నీ నిండుకుండలా జలకళను సంతరించుకున్నాయని, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలన్నీ పూర్తిగా నిండాయని, భగవంతుని దయతో ఈ ఏడాది పాడి, పంటలతో రైతుల లోగిళ్లు కళ కళలాడాలని ఆ వెంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన యజ్ఞ యాగాలు అన్న సమారాధన, చివరిరోజు పూర్ణాహుతి కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరిగాయని ఆలయ కమిటీ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వినుకొండలో బ్రహోత్సవాలు ఇంత ఘనంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా పడి చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ నలుమూలల నుంచి మహిళ భక్తులు, వ్యాపారులు, వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

వినుకొండ టౌన్, ఆగస్టు 20: రోడ్డు ప్రమాదంలో గాయపడి, వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ గుర్తించాలని వైద్యసిబ్బంది మంగళవారం కోరారు. సిబ్బంది తెలిపిన వివరాలను పరిశీలిస్తే రెండు రోజుల క్రితం పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. స్థానికులు చూసి 108సాయంతో వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలోని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు తగలడంతో చికిత్స అందించారు. గాయాలతో బాధపడుతున్న వ్యక్తి నీరసంగా, కనీసం మాట్లాడే స్థితిలో లేకపోవటంతో సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలికి తీవ్రగాయాలు

శావల్యాపురం, ఆగస్టు 20: ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైన సంఘటన వినుకొండ మండలం విఠంరాజుపల్లి వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శావల్యాపురం మండలం చిన్నకంచెర్ల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మి వినుకొండ నుంచి చిన్నకంచెర్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరింది. విఠంరాజుపల్లి వద్దకు రాగానే కుక్క హఠాత్తుగా ద్విచక్రవాహనానికి అడ్డురావడంతో తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి లక్ష్మి రోడ్డుపైపడి తీవ్రగా గాయపడింది. వేల్పూరు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు దాసు అటుగా వస్తూ 108కి సమాచారం అందించి ఆమెను వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం గుంటూరుకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కొండ్రముట్లలో పశువైద్య శిబిరం

కొండ్రముట్ల (ఈపూరు) ఆగస్టు 20: మండలంలోని కొండ్రముట్లలో పశుసంవర్ధకశాఖ, జిల్లా పశు గణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఏడీఏ పీ శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. పశువులకు పరీక్షలు చేసి 38 గేదెలకు గర్భకోశ చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ అందజేశారు. పశువులకు సోకే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని ఏడీఏ సూచించారు. వైద్యశిబిరాలు వినియోగించుకోవడం వలన రైతులు ఆర్థికంగా లాభపడవచ్చునన్నారు. శిబిరంలో రాజుపాలెం ఏడీఏ జీ వీరయ్య, పశు వైద్యులు గోపాల్ నాయక్, వైద్యసిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై క్విజ్ పోటీలు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 20: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 2024-2025 యూత్ ఫెస్ట్‌లో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కోసం పల్నాడు జిల్లాలో పాఠశాలలు జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్‌ను నిర్వహించినట్లు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రథమ బహుమతి నరసరావుపేట శంకర్ భారతీపురం పాఠశాల, ద్వితీయ బహుమతి చల్లగుండ్ల జడ్పీహెచ్ఎస్, తృతీయ బహుమతి విప్పర్ల రెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు జానీబాషా, రాజశేఖర్, హెచ్ఎం సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు



నూతనంగా నిర్మించిన దేవాలయం

నూజెండ్ల, ఆగస్టు 20: మండలంలోని గుర్రపునాయుడుపాలెంలో శ్రీమహాగణపతి, పోలేరమ్మ, సీతాలాంబ (నాభిశిల), సీతారామచంద్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామస్థుల సహకారంతో తొమ్మిది సంవత్సరాలుగా సీతారామ చంద్రస్వామి దేవాలయంను పూర్తిస్థాయిలో గ్రానైట్ రాయితో నిర్మించారు. గంగినేని రామయ్య పర్యవేక్షణలో నిర్వహణ పనులు జరగ్గా గ్రామస్థులు, ఎన్ఆర్ఐలు, ఉన్నత ఉద్యోగులు రూ.2కోట్ల నిధులు సమకూర్చారు. ఉదయం నుంచి మంగళతోరణం, గోపూజ, విఘ్నేశ్వరపూజ తదితర పూజా కార్యక్రమాలను పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో కొండవీటి రాఘవాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రహదారి భద్రతపై యువతకు అవగాహన

నరసరావుపేట రూరల్, నరసరావుపేట లీగల్, ఆగస్టు 20: యువత రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని కోటప్పకొండ-నరసరావుపేట రోడ్డులో మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు నడుపుతున్న మైనర్ల, తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇన్చార్జ్ ఎస్‌డీపీవో జిల్లా క్రైమ్ ఎస్పీ లక్ష్మీపతి ఆధ్వర్యంలో నరసరావుపేట ట్రాఫిక్ సీఐ రమేష్‌బాబు మంగళవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

ఘనంగా ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 20: పట్టణంలోని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దోమలు నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, మరో అతిథిగా మున్సిపల్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ హనుమకుమార్ డాక్టర్ గీతాంజలి వెంకటేశ్వర్లు శ్రీనివాస్ రావు, మలేరియా సబ్‌యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేటలో వ్యక్తి అదృశ్యం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 20: పట్టణంలోని 60అడుగుల రోడ్డులో నివాసముంటున్న చలపాటి బ్రహ్మయ్య అదృశ్యమైనట్లు భార్య ప్రవీణ ఫిర్యాదు చేశారు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట పట్టణంలోని 60అడుగుల రోడ్డుకు చెందిన చలపాటి బ్రహ్మయ్య మంగళవారం ఉదయం సుమారుగా ఐదు గంటలకు ఇంటినుండి వాకింగ్ కోసం వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదన్నారు. భార్య ప్రవీణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాల పంపిణీ

నూజెండ్ల, ఆగస్టు 20: మండలంలోని పెద్దవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థి ధూపాటి కిరణ్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు.

పత్తి పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 20: పత్తి పంటలో గులాబిరంగు పురుగు నివారణ చర్యలపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి సూచించారు. నరసరావుపేట మండలం కేతముక్కల అగ్రహారంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి పత్తి పంటలను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఎం.శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య గ్రామ వ్యవసాయ సహాయకులు పూదోట పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

నరసరావుపేట రూరల్, ఆగస్టు 20: స్థానిక నరసరావుపేట, రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్, సైబర్ సెక్యూరిటీ, ట్రాఫిక్ రూల్స్, ఉమెన్ సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ ఎస్ఐ లేఖ ప్రియాంక మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణం కోసం విరాళం

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), ఆగస్టు 20: ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం కోసం భక్తులు రూ.1,00,116 విరాళంను అందజేశారు. గ్రామానికి చెందిన మక్కెళ్ళ నాగేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య శివమ్మ, కుమారుడు లక్ష్మీనాగార్జున, ప్రమీలరాణి దంపతులు విరాళంను మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు.

పునఃపరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలి

● ఎంపీడీవోకు వయ్యకల్లు పింఛన్‌దారుల వినతి

శావల్యాపురం, ఆగస్టు 20: పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన పింఛనుదారులు కొందరు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ వయ్యకల్లు గ్రామానికి చెందిన 59మంది పింఛన్లను పునఃపరిశీలన చేసేందుకు అధికారులు నోటీసులు జారీచేశారని, వారిలో వికలాంగులు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలు ఉన్నారని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



కొల్లి భూపతి (ఫైల్ ఫొటో)

నాదెండ్ల, ఆగస్టు 20: మండలంలోని చిలకలూరిపేట నరసరావుపేట రహదారిపై అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. వాహనం నడుపుతూ తీవ్రంగా గాయపడిన కొల్లి భూపతి (35) గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. భూపతిది నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామం. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కనపర్రు బావి సమీపంలోని పుష్పావతి కోల్డ్ స్టోరేజ్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నిన్న మృతి చెందిన కనుమూరి ఆంజనేయులుకు ఆయన మేనల్లుడు అవుతాడు. కాగా అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



మేజర్ కాలువపై పూడ్చిన గండి

శావల్యాపురం మేజర్ కాలువ గండి పూడ్చివేత

శావల్యాపురం, ఆగస్టు 20: అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి శావల్యాపురం పొలాలకు సాగునీటిని అందించే మేజర్ కాలువకుపడిన గండిని ఎట్టకేలకు ఎన్నెస్పీ అధికారులు మంగళవారం పూడ్చించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన శావల్యాపురం మేజర్ కాలువకు గండి అన్న కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు మేజర్ కాలువకు పడ్డ గండిని వెంటనే పూడ్చించాలని స్థానిక ఎన్నెస్పీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఎన్నెస్పీ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో గండిని పూడ్చించి మేజర్‌కాలువకు సాగునీటిని పునరుద్ధరించారు. ఎన్నెస్పీ డీఈ రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కుగాను అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులందరికీ సాగునీరు అందేలా చర్యలు తీసుకొంటామని, ఏవైనా సమస్యలుంటే రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యత, బీమా పథకాలపై అవగాహన

యడ్లపాడు, ఆగస్టు 20: ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యతలపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ఈవోపీఆర్డీ వరూధిని మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై పథకాల ద్వారా ప్రభుత్వం గ్రామాలలోని పేదలకు ఆరోగ్య, జీవిత బీమా ప్రయోజనాలు కల్పిస్తున్నదన్నారు. అతి తక్కువ మొత్తానికే ఈ పథకాల ద్వారా బీమా ప్రయోజనాలు కల్పిస్తున్నదన్నారు. సెర్ప్ సంస్థ ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కంపెనీలు అందిస్తున్న బీమా ప్రయోజనాలతో పోల్చితే ప్రభుత్వం పీఎంఎస్‌బీవై, పీఎంజేజేవై, పీఎంఎంవై పథకాల ద్వారా అందిస్తున్న ప్రయోజనాలు అధికంగా ఉన్నాయన్నారు. అతి తక్కువ ప్రీమియంకే ఈ పథకాలను అందించడం జరుగుతున్నదన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా పథకాల ప్రయోజనాలను వివరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పథకాలలో చేరి ప్రయోజనం పొందాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ సెర్ప్ సంస్థ ప్రతినిధులు బొల్లయ్య, ఏసోబు, వివిధ గ్రామాలకు చెందిన క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

చిలకలూరిపేట, ఆగస్టు 20: రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ అత్యధిక మెజార్టీతో ఎన్నికై ఆదర్శ వంతమైన పాలనను ప్రధానిగా అందించారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఎం రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులను రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టి లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ నస్రుద్దీన్, హాజీ షేక్ సలాం, చేరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, సుంకర హరిబాబు, ఇంటూరి భవానీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌లు ఇచ్చాకే మునిసిపల్ టీచర్లను సర్దుబాటు చేయాలి

● ఎస్‌టీయూ నాయకుడు పోటు శ్రీనివాసరావు

చిలకలూరిపేట, ఆగస్టు 20: మునిసిపల్ పాఠశాలల్లో ప్రమోషన్‌లు ఇచ్చాకనే సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఎస్‌టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు మంగళవారం డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో కే లక్ష్మికి అందజేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, మేనేజ్‌మెంట్ సంస్థలాగానే మునిసిపాలిటీల్లో కూడా సర్దుబాటు చేయటం సబబుగా ఉంటుందని పేర్కొన్నారు. మండల ఉపాధ్యాయులను మునిసిపాలిటీలో, మునిసిపల్ ఉపాధ్యాయులను మండలాల్లో సర్దుబాటు చేయటాన్ని ఎస్‌టీయూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు సరికొండ అక్కయ్య మేకల కోటేశ్వరరావు, వీ జయప్రకాష్, సమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్ విజయవంతం చేయాలని దళిత జేఏసీ విజ్ఞప్తి

చిలకలూరిపేట, ఆగస్టు 20: చిలకలూరిపేట నియోజకవర్గంలో బుధవారం జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని చిలకలూరిపేట దళిత జేఏసీ నాయకులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. అన్ని విద్యా వ్యాపారాల సంస్థలను మూసివేసి సహకరించాలని వారు కోరారు. భారత్‌బంద్ కార్యక్రమంలో దళిత సోదరులందరూ పాల్గొనాలని వారు కోరారు.

గ్రంథాలయంలో జిల్లా కార్యదర్శి తనిఖీ



బొల్లాపల్లి శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి వక్కదారి సుబ్బారత్నం

బొల్లాపల్లి, ఆగస్టు 20: స్థానిక మండల కేంద్రమైన శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వక్కదారి సుబ్బారత్నం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన అన్ని పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇంకా ఏమైనా కావాల్సి ఉంటే గ్రంథాలయ అధికారి రామవత్ సేవా నాయక్ వద్ద ఉన్న ఆన్ డిమాండ్ పుస్తకంలో నమోదుచేస్తే, అలాంటి పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి శాఖా గ్రంథాలయానికి సరఫరా చేస్తామన్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 97 శాఖా గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సుబ్బారత్నం కోరారు.